
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3


తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 6 అక్టోబరు 2025



కందిపప్పు ఉడికేదెన్నడో?

● ఈ నెల రేషన్‌లోనూ లేనట్లే

ఏ నెలకా నెల రేషన్‌లో కందిపప్పు వస్తుందని ఎదురు చూస్తున్న పేదలకు అక్టోబరులోనూ నిరాశే మిగిలింది. ఈ నెల కోటాలోనూ కందిపప్పు రాని పరిస్థితి. రాష్ట్ర స్థాయిలో కందిపప్పు కొనుగోళ్లకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో డిసెంబరు నుంచి అందజేస్తామని ప్రకటించారు. దీంతో ఈ నెలలోనూ బియ్యం, చక్కెర, రాగులుతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. జిల్లాలో 5,81,125 బియ్యం కార్డులుండగా, 450 టన్నుల కందిపప్పు పంపిణీ చేయాలి. వీరికి, ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి కందిపప్పు సరఫరా ఆగిపోయింది. చౌకదుకాణాల్లో కార్డు దారులకు కేవలం రూ.67కే కిలో కందిపప్పు వచ్చేది. బహిరంగ మార్కెట్‌లో నాణ్యమైన కంది పప్పు కిలో రూ.140 వరకు పలుకుతోంది. దీంతో లబ్ధిదారులు రేషన్‌లో ఇచ్చే కందిపప్పు కోసం ఎదురు చూస్తున్నారు.


- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఈ బ్యాటరీ బండ్లు బయటకు తీయండి సారూ!



శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)కు వచ్చే రోగులకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేసిన బ్యాటరీ వాహనాలు మూలనపడ్డాయి. స్విమ్స్‌కు అనుబంధంగా ఉండే శ్రీపద్మావతి ఆస్పత్రి సెల్లార్‌లో బూజుపట్టి దర్శనమిస్తున్నాయి. వృద్ధులు, వికలాంగులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగుల తరలింపునకు గతేడాది కరూర్ వైశ్యాబ్యాంకు ఐదు బ్యాటరీ వాహనాలను వితరణ చేసింది. 11 సీట్ల సామర్థ్యం ఉన్నవి 4 వాహనాలతో పాటు 14 సీట్ల సామర్థ్యం ఉన్న మరో ఈ-బగ్గీని అందజేసింది. స్విమ్స్ సర్కిల్ నుంచి స్విమ్స్ క్యాజువాలిటీ వరకు రోగులు, కుటుంబ సభ్యులతో ప్రతిరోజు ఉదయం 8 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు రవాణా చేస్తూ వచ్చారు. కొంత కాలంగా ఈ-బగ్గీస్ పెద్దగా కనిపించడంలేదని ఆరా తీస్తే.. పద్మావతి ఆస్పత్రి సెల్లార్‌లో మూడు వాహనాలు దుమ్ముపట్టి కనిపించాయి. చిన్న రిపేరు రావడంతో పక్కన పెట్టేసినట్టు తెలుస్తోంది. వాల్మీకి సర్కిల్ నుంచి రవాణా చేయకపోయినా స్విమ్స్ ఓపీడీ, క్యాజువాల్టీ నుంచి పద్మావతి ఆస్పత్రి, క్యాన్సర్, డయాలసిస్ సెంటర్ వంటి అంతర్గతంగానైనా బ్యాటరీ వాహనాలను తిప్పాల్సిన అవసరం ఉంది. వాటిని అందుబాటులోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



రైతు భూమికి రాజముద్ర

జిల్లాకు చేరిన 52,579 కొత్త పట్టాదారు పుస్తకాలు

పలు కారణాలతో పెండింగ్‌లో 24,636 పుస్తకాలు

మిగిలినవి మండలాలకు తరలింపు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భూమి రైతులది. పాస్‌పుస్తకాలపై బొమ్మ మాజీ సీఎం జగన్‌ది. సరిహద్దు రాళ్లపైనే ఆయన బొమ్మనే చెక్కించుకున్నారు. ఇలా నాటి సీఎం జగన్ ఫొటోల పిచ్చిపై రైతులు ఆగ్రహం.. ఆందోళన వ్యక్తంచేశారు. తాము అధికారంలోకి వస్తే రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలు అందిస్తామని నాడు చంద్రబాబు ప్రకటించారు. ఆ హామీ మేరకు రాజముద్ర, భూయజమాని చిత్రాలతో 52,579 కొత్త పాస్‌పుస్తకాలు జిల్లాకు చేరాయి. వందేళ్ల తర్వాత భూములు రీసర్వే చేస్తున్నట్లు నాడు వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంది. జిల్లాలో 1,048 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 320 గ్రామాల్లో రీసర్వే చేపట్టింది. రైతులకు కనీస సమాచారం లేకుండానే హద్దులు పాతారు. ఆ సర్వే కూడా తప్పుల తడకగా సాగింది. ఇది రైతుల మధ్య వివాదాలకు దారి తీసింది. పల్లెల్లో భూ పంచాయితీలు పెరిగాయి. ఇవేవీ పట్టించుకోకుండానే నాటి ప్రభుత్వం హడావిడిగా 52,579 మంది రైతులకు భూహక్కు పత్రాలను జారీ చేసింది. జగన్ ఫొటోతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. చివరకు రీసర్వే చేసిన ప్రాంతాల్లో హద్దురాళ్లపైనా జగన్ బొమ్మను చెక్కడంపైనా రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ క్రమంలో కూటమి అధికారంలోకి వచ్చాక.. ఎన్నికల హామీ మేరకు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో తప్పులను సరిచేసింది. రాజముద్ర, భూయజమాని ఫొటో, పూర్తి వివరాలతో కొత్తపట్టాదారు పుస్తకాలను తీసుకొచ్చింది. రీ సర్వే జరిగిన 320 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి 52,579 పాసుపుస్తకాలు తిరుపతికి చేరాయి. వీటిలో చిన్నచిన్న తప్పిదాలు, మృతి చెందినవారివి, నోషనల్ ఖాతాలు ఉన్న 24,636 పాసుపుస్తకాలను పెండింగ్‌లో ఉంచారు. మిగిలిన 27,942 పట్టాదారు పాసుపుస్తకాలను కలెక్టరేట్ నుంచి ఆయా తహసీల్దారు కార్యాలయాలకు పంపించారు. త్వరలో భూయజమానులకు వీటిని పంపిణీ చేస్తామని డీఆర్వో నరసింహులు తెలిపారు. మిగిలిని వారికి త్వరలో నూతన పట్టాదారు పాసుపుస్తకాలు అందనున్నాయి.



'నియోజకవర్గంలోని కొందరు మద్యం దుకాణదారులు, భూదందాలు చేసిన వారు పైరవీల కోసం నావద్దకు వచ్చారు. వారిని నిర్మొహమాటంగా తిరిగి పంపించేశా. ఇలా ఏడాది పాటు నా వద్దకొచ్చిన వ్యవహారాలను తిప్పికొట్టా. ఇలాంటి అంశాల్లో గతంలో రోజా రూ.కోట్లు సంపాదించారు. నేను అవినీతి అక్రమాలకు తావివ్వను. ఎవరైనా నా పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తే ఉపేక్షించను.

- ఎమ్మెల్యే భానుప్రకాష్

160 మంది.. రూ.1.32 కోట్లు

● నగరిలో 'సీఎంఆర్ఎఫ్' చెక్కుల పంపిణీ

నగరి నియోజకవర్గంలోని 160 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద రూ.1,32,34,595 మంజూరయ్యాయి. ఈ చెక్కులను ఆదివారం నగరిలోని టీడీపీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పంపిణీ చేశారు. చంద్రబాబు సీఎం అయ్యాక అర్హులైనవారందరికీ సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చులను మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ సమావేశంలో నగరి నేతలతో పాటు పుత్తూరు మున్సిపల్ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, మండల అధ్యక్షుడు అరవ బాలాజి, ధనంజయనాయుడు, రమేష్‌రాజు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు చిట్టి, నగరి పీఏసీఎస్ అధ్యక్షుడు బాలాజి తదితరులు పాల్గొన్నారు.

- నగరి, ఆంధ్రజ్యోతి

కురవ, కురబ సంక్షేమానికి కృషి

● తిరుపతిలో భక్త కనకదాస విగ్రహావిష్కరణలో మంత్రి సవిత

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : కురవ, కురబల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. తిరుపతి పూర్ణకుంభం సర్కిల్ వద్ద ఆదివారం భక్తకనకదాస విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. రామతులసి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం భక్తకనకదాసు విగ్రహాన్ని వితరణగా ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. తిమ్మప్ప భక్తకనకదాసుగా మారిన విధానాన్ని వివరించారు. అపారమైన భక్తితో వెంకటేశ్వరస్వామి అనుగ్రహం పొందిన భక్తాగ్రేసరుడని పేర్కొన్నారు. కురవ, కురబ కమ్యూనిటీ భవన నిర్మాణానికి అనవరమైన స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ భక్తకనకదాసు భక్తికి వెంకటేశ్వరస్వామి మెచ్చి తనకు సమర్పించిన వస్త్రాన్ని ఆయనకు స్వయంగా అలంకించారని తెలిపారు. అటువంటి భక్తా శ్రేష్ఠుడి కాంస్య విగ్రహం తిరుపతిలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కర్ణాటక మాజీ మంత్రి, ఎమ్మెల్యే రేవన్న మాట్లాడుతూ కమ్యూనిటీ భవన నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ కురవ, కురబల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. బెంగుళూరులోని కనకదాసు మఠం పీఠాధిపతి సిద్ధరామానంద స్వామి మాట్లాడుతూ భక్తి ఎక్కడుంటే కనకదాసు అక్కడుంటారని తెలిపారు. యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడారు. అంతకు ముందు బాలాజీ కాలనీలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, ర్యాలీగా ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పూర్ణకుంభం సర్కిల్ వద్దకు చేరుకున్నారు. కురవ, కురబ సంఘం నేతలు, విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భక్తకనకదాస విగ్రహావిష్కరణలో మంత్రులు, ఎమ్మెల్యేలు

విలువలతో కూడిన బోధన ప్రథమ కర్తవ్యం

● నూతన ఉపాధ్యాయులకు డీఈవో దిశానిర్దేశం

తిరుపతి(విద్య), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మానవతా విలువలతో కూడిన ఉత్తమ బోధన అందించడం ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యమని డీఈవో కేవీఎన్ కుమార్ సూచించారు. మెగా డీఎస్సీలో ఎంపికైన కొత్త ఉపాధ్యాయులకు తిరుపతి రూరల్ దుర్గసముద్రంలోని మెడ్‌జీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణను ఆదివారం ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయ వృత్తి సమాజంలో అత్యంత బాధ్యతాయుతమైనదంటూ ఉపమానాలతో వివరించారు. అందుకు అనుగుణంగా తమను తాము మలచుకోవాలని సూచించారు. జాతీయ విద్యా విధానం 2020- నిపుణ్ భారత్‌లో భాగమైన ఎఫ్ఎల్‌యన్ గ్యారంటీడ్ శిక్షణను సద్వినియోగం చేసుకుని బోధనలో నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. ప్రతి పిల్లవాడి సర్వతోముఖాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో తిరుపతి ఉప విద్యాశాఖాధికారి ఇందిరా దేవి, ఎంఈవోలు భాస్కర్ బాబు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు, డాక్టర్ సుధాకర్, పద్మావతి, భువనేశ్వరి, రిసోర్స్ పర్సన్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో కుమార్

నేడు పోలీస్ పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్ కార్యాక్రమాన్ని ఈ రోజు (6వ తేది) రద్దు చేస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతికి ప్రముఖుల రాక సందర్భంగా రద్దు చేశామని పేర్కొన్నారు. ప్రజలు ఎస్పీ కార్యాలయానికి రావద్దని, అత్యవసర పరిస్థితుల్లో సమీప పోలీస్ స్టేషన్లలో సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

సత్యవేడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందాడు. ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాలు... మండలంలోని ఏఎంపురానికి చెందిన ట్రాన్స్‌కో ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి విధుల్లో బాగంగా శనివారం సాయంత్రం బాలకృష్ణాపురంలో ట్రాన్స్‌పార్మర్ మరమ్మతులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సుబ్రమణ్యం రెడ్డి భార్య రేవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా సుబ్రమణ్యం రెడ్డికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.



సుబ్రహ్మణ్యం రెడ్డి (ఫైల్)

నేడు, రేపు తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పౌర్ణమిని పురస్కరించుకుని తమిళనాడులోని తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు సీటీఎస్ ఏటీఎం భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 4 నుంచి మంగళవారం ఉదయం 9 గంటల వరకు ప్రతి అరగంటకు ఓ బస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు బస్సులు అందుబాటులో ఉంటాయని వివరించారు.

నలుగురు రైల్వే ఉద్యోగుల సస్పెన్షన్

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పాకాల- పూతలపట్టు రైలు మార్గంలో ఇటీవల మరమ్మతులు చేస్తుండగా ఓహెచ్‌ఈ కార్ పట్టాలు తప్పిన ఘటనలో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ గుంతకల్లు డివిజన్ మేనేజరు చంద్రశేఖర్‌గుప్తా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజనీరింగ్ విభాగం జేఈ ఉదయభాను, మేస్త్రీ సన్యాసరావు, గ్యాంగ్‌మెన్ షణ్ముగంతో పాటు ఓహెచ్‌ఈ కార్ డ్రైవర్‌ను ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు మంత్రి నారా లోకేశ్ రాక

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం జిల్లాకు రానున్నారు. ముంబై నుంచి సోమవారం రాత్రి 11.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన చంద్రగిరి మండలం నారావారిపల్లెలోని స్వగృహానికి చేరుకుంటారు. మంగళవారం ఉదయం 8.45 గెడ్డంవారిపల్లె గ్రామానికి చేరుకుని ఇటీవల మృతిచెందిన టీడీపీ నేత సుబ్రహ్మణ్యంనాయుడు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. తిరిగి 9.45 గంటలకు నారావారిపల్లెకు చేరుకుంటారు. తన కుటుంబసభ్యులతో కలిసి బాబాయి రామ్మూర్తినాయుడు 11వ నెల విస్తరి కార్యక్రమంలో పాల్గొంటారు. 3 గంటలకు సీఎం చంద్రబాబుతో కలిసి హెలికాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరి వెళ్లనున్నారు.

తిరుపతిలో నీలిట్ కేంద్రం



ప్రారంభ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, వీసీ అప్పారావు, ఎంపీ గురుమూర్తి

● వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జాతీయ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక సంస్థ (నీలిట్) కేంద్రం ప్రారంభమైంది. ఎస్వీ యూనివర్సిటీలో ఇందుకు సంబంధించి ఏర్పాటు చేసిన తాత్కాలిక కేంద్రాన్ని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఎంపీ గురుమూర్తి, జేసీ శుభం బన్సల్, ఎస్వీయూ వీసీ అప్పారావు తదితరులు స్థానికంగా హాజరయ్యారు. ఈ కేంద్రం ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించేందుకు మార్గం సుగమం చేస్తుందని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఆధునిక ఐటీ, సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ రంగంలో అవసరమైన శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. సమాచార సాంకేతికత (ఐటీ), వెబ్ డిజైనింగ్, పీసీ హార్డ్‌వేర్ అండ్ నెట్ వర్కింగ్, ఆఫీస్ ఆటోమేషన్, అకౌంటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వంటి కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

రూ.10వేల కోట్లతో మున్సిపాలిటీల అభివృద్ధి

గూడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అమృత్ పథకం ద్వారా రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో రూ.10 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, కురుగొండ రామకృష్ణతో కలిసి మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. గూడూరు మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు అమృత్ పథకం కింద రూ.73 కోట్లు మంజూరయ్యాయన్నారు. డ్రైన్లను అభివృద్ధి పరిచేందుకు రూ.28 కోట్లు మంజూరు చేస్తామన్నారు. అలాగే, సూళ్లూరుపేట మున్సిపాలిటీకి రూ.218 కోట్లు, నాయుడుపేటకు రూ.173 కోట్లు, వెంకటగిరికి రూ.120 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, మున్సిపల్ కమిషనర్లు వెంకటేశ్వర్లు, ఫజులుల్లా, చిన్నయ్య, వెంకట్రామిరెడ్డి, నాయకులు శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, మట్టం శ్రావణి, గురవయ్య, నరసింహులు, శ్రీధర్, కల్పన, భారతి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

గూడూరు సబ్‌కలెక్టర్ బదిలీ

● ఏజీఎంయూటీ క్యాడర్‌కు రాఘవేంద్ర మీనా



గూడూరు అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా అరుణాచల్‌ప్రదేశ్ - గోవా - మిజోరాం, కేంద్రపాలిత ప్రాంతాల(ఏజీఎంయూటీ) క్యాడర్‌కు బదిలీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన మీనా గతేడాది సెప్టెంబరు 7వ తేదీన గూడూరు సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. కొద్దినెలల క్రితం ఏజీఎంయూటీ క్యాడర్ ఐపీఎస్ అధికారిణి సులేఖా జగర్వార్‌తో ఆయనకు వివాహం అయ్యింది. దీంతో అదే క్యాడర్‌కు తనను బదిలీ చేయాలంటూ మీనా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడంతో రాఘవేంద్ర మీనాను ఏజీఎంయూటీ క్యాడర్‌కు బదిలీ చేస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వారంలో రోజుల్లో సబ్‌కలెక్టర్ రిలీవ్ కానున్నారు.

చౌడేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న నాని

ఎర్రావారిపాలెం, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): చెరుకువారిపల్లె పంచాయతీ వంకమద్దివారిపల్లెలో కొత్తగా నిర్మించిన చౌడేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే నాని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు పూర్ణ కుంభస్వాగతంతో ఎమ్మెల్యే నానికి స్వాగతం పలికారు. కుంభాభిషేకం కార్యక్రమానికి హాజరు కావడం సంతోషంగా ఉందని నాని చెప్పారు. నాయకులు రఘునాథ, మహేష్ నాయుడు, శివరామిరెడ్డి, వేణుగోపాల్ నాయుడు, చిన్నపరెడ్డి ,నిరంజన్ రాయల్,మధు, ప్రసాద్ నాయుడు,నాగరాజు పాల్గొన్నారు.

కాలువలు లేక చెరువు నీరు వృథా



పీవీపురం వద్ద నక్కలవాగులో వృథాగా పోతున్న రాయలచెరువునీరు

రామచంద్రాపురం, అక్టోబరు 5(ఆంధ్ర జ్యోతి): కాలువలు లేక రాయలచెరువు నీరు వృథా అవుతోంది. 40ఏళ్ల క్రితం వరకూ ఈ చెరువు కింద 1,300ఎకరాలు సాగయ్యేవి. రైతులు ఈ నీటిని వంతుల వారీగా సాగుకు ఉపయోగించుకునేవారు. అప్పట్లో సంజీవరాయపురం, పీవీపురం, బలిజపల్లి, గంగమాంబపురం, రామిరెడ్డిపురం, గంగిరెడ్డిపల్లి, కమ్మకండ్రిగ, మిట్టూరు, నడవలూరు వరకు దాదాపు 3కిలోమీటర్ల మేర చిన్న, పెద్ద కాలువలు ఉండేవి. పదేళ్లుగా పీవీపురం వద్ద నక్కలవంక రాయలచెరువు నీరు కలుస్తుంది. ఇక్కడ పదేళ్ల క్రితం చెక్‌డ్యామ్ మరమ్మతులకు గురికావడంతో నీరు నక్కలవంక ద్వారా స్వర్ణముఖి నదిలో కలుస్తోంది. అదేవిధంగా కాలువలు ఆక్రమణకు గురికావడంతో చెరువునీరు వృథాగా వంకల పాలవుతోంది. చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేపట్టి కాలువలు తీస్తే వందలాది ఎకరాలకు నీరు అందుతుందని రైతులు పేర్కొంటున్నారు.

చలో విజయవాడ జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మల్లీశ్వర్

పాకాల, అక్టోబరు 5 (ఆంధ్ర జ్యోతి) ఫ్యాప్టో రాష్ట్రశాఖ మంగళవారం తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని చిత్తూరు జిల్లా ఫ్యాప్టో కో చైర్మన్ బి.రామమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వాలని మెమో 57ను అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను కొనసాగించాలని కోరారు. సమావేశంలో బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారుడు బి.ఆంజినేయులు, నాయకులు ఎన్.,ఆదికేశవులు తదితరులు పాల్గొన్నారు. **ఎర్రావారివారిపాలెం:** చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అంజిమేటి మల్లీశ్వర్ ఉపాధ్యాయులకు పిలుపు నిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏఈలను ఇవ్వక పోవడం దారుణమన్నారు. 12వ వేతన సవరణ కమిటీ నియమించాలని,ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పన్న,కన్నయ్య పాల్గొన్నారు.

కంకర తేలిన రహదారిపై కష్టాలు



పాకాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పాలినేనివారిపల్లె సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు అధ్వానంగా తయారయింది. రైల్వే మార్గంలోని ఈ ప్రాంతంలో రైల్వే గేట్ తొలగించి అండర్ బ్రిడ్జి నిర్మించారు. పాకాల నుంచి పంటపల్లె, యల్లంపల్లె, దేశిరెడ్డిపల్లె, ఇంకోవైపు తలారిపల్లె, ముద్దలపల్లె, శ్రీనివాసనగర్ ప్రాంతాలకు నాలుగువైపులా బ్రిడ్జి కింద రోడ్డు నిర్మించారు. ఈ మార్గంలో వెళ్తే పాకాల - నేంద్రగుంట రోడ్డులో కలుసుకొని సౌకర్యంగా వెళ్లవచ్చు. అయితే బ్రిడ్జి కింద ఉత్తరం వైపు రోడ్డుపై కంకర తేలి గుంతలుగా ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



తిరుచానూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో వారాంతపు సెలవులను పురస్కరించుకుని ఆదివారం జరిగిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. తిరుపతి పద్మ కళాక్షేత్రం డ్యాన్స్ అకాడమికి చెందిన గురువు శ్రీదేవి బాలాజీ ఆధ్వర్యంలో లెనిషా, వెనీషా, లక్షణ, మనస్విని, చంద్రాణి, సాయిసంజన, జయశ్రీ, కుషిశ్రీ, కుశలశ్రీ, పూజితలు పుష్పాంజలి, శ్రీగిరి, మూషికవాహన, శివ తాండవం, రావమ్మా మహాలక్ష్మి, బ్రహ్మామొక్కటే, భరత వేదముగ, శ్రీమన్నారాయణ వంటి కీర్తనలకు నృత్యప్రదర్శనలు చేశారు. శిల్పారామం ఏవో సుధాకర్ జ్ఞాపికలను అందజేశారు.

ఆలయాలకు పాలక మండళ్ల నియామకం

పిచ్చాటూరు, అక్టోబరు 5(ఆం ధ్రజ్యోతి): మండలంలోని సుప్ర సిద్ధ శివాలయం రామగిరి వాలీశ్వర స్వామి ఆలయ పాలక మండలి ఛైర్మన్‌గా కె.ఎల్.వెంకటే శులు, రామగిరి కుమార సుబ్ర హ్మణ్య స్వామి ఆలయ పాలక మండలి ఛైర్మన్‌గా టి.ఎన్. సుబ్ర హ్మణ్యం నియమితులయ్యారు. నియోజకవర్గంలో ఇటీవల జరు గుతున్న పరిణామాల కారణంతో శనివారం ఆలయ ఆవరణలో ప్రమాణ స్వీకారాలు కూడా చేసినట్లు సమాచారం. వీరితో పాటు ఒక్కో ఆలయానికి 8 మంది డైరెక్టర్లు నియమితులయ్యారు. డైరెక్టర్లలో టీడీపీ, జనసేన, బీజేపీలకు చోటు కల్పించారు.

శాస్త్రోక్తంగా సద్యోమూర్తి ఉత్సవం



శ్రీకాళహస్తి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం సద్యోమూర్తి ఉత్సవాన్ని నిర్వహించారు. త్రయోదశి మరుసటి రోజు పూర్వాభాద్ర నక్షత్రం రోజున ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ముందుగా స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ అలంకార మండపంలో పలు రకాల అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను ఆలయ ప్రాకరంగా ఊరేగించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



మంత్రి నారాయణ





వీసా చిత్ర బృందం- మంత్రి సవిత

తిరుమల, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రులు నారాయణ, సవిత, ఎంపీలు నాగరాజు, పార్థసారథి, ఉన్నారు. వీరికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. 'వీసా' చిత్ర బృందం కూడా శ్రీవారిని దర్శించుకుంది. హీరో అశోక్ గల్లా, హీరోయిన్ గౌరీప్రియ, దర్శకుడు ఉద్భవ్ రఘు కూడా స్వామిని దర్శించుకున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి):తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు లభించింది. శనివారం శ్రీవారిని దర్శించుకున్న 83,380మంది భక్తులు దర్శించుకున్నారు. 32,275 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

సర్పంచ్ తండ్రి మృతికి ఎమ్మెల్యే నివాళి

చంద్రగిరి, అక్టోబరు 5, (ఆంధ్రజ్యోతి): కందులవారిపల్లి సర్పంచ్ మునిలక్ష్మీ తండ్రి మునస్వామి నాయుడు మృతికి ఎమ్మెల్యే పులివర్తి నాని సంతాపం ప్రకటించారు. టీడీపీ నాయకులతో కలిసి శేషాపురం చేరుకొని ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కేవీబీపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరమాల లో శనివారం రాత్రి ట్రాక్టర్ సహా నాలుగున్నర టన్నుల రేషన్‌బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేవీబీపురం ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు... సూరమాలకు చెందిన చిరంజీవి రేషన్‌బియ్యాన్ని ట్రాక్టర్‌లో నింపి తరలించడానికి సిద్ధంచేశాడు. తిరుపతి స్పెషల్ బ్రాంచ్ అధికారుల సమాచారం మేరకు పోలీసులు సూరమాలకు చేరుకుని ట్రాక్టర్ సహా రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. చిరంజీవిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యాన్ని తహసీల్దారుకు సమాచారం ఇచ్చి రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

టపాకాయల సీజ్



నాగలాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇంటి వద్ద నిల్వ ఉంచిన టపాకాయలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సునీల్ తెలిపారు. పట్టణంలోని బ్రాహ్మణవీధికి చెందిన ఇక్బాల్ అనుమతులు లేకుండా ఇం ట్లోనే టపాకాయలు విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ సిబ్బందితో ఇంటిపై దాడి చేసి టపాకాయలను స్వాధీనం చేసుకున్నారు. ఇక్బాల్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న టపాకా యల విలువ రూ.1,05,100 ఉంటుందని తెలిపారు.

నిర్వహణ లోపంతో చెరువులకు చేరని నీరు

అధ్వానంగా దామలచెరువు - పాకాల సప్లయ్ ఛానల్



సప్లయ్ ఛానల్‌లో పిచ్చిమొక్కలు



నీళ్లు చేరక నిండని తడకర చెరువు

పాకాల, అక్టోబరు 5: (ఆంధ్రజ్యోతి): దామలచెరువు-పాకాల సప్లయ్ ఛానల్ నిర్వహణ లోపంతో అధ్వానంగా తయారయింది. దామలచెరువు పెద్ద వంకలో నీరు ప్రవహిస్తున్నా సప్లయ్ ఛానల్‌లో పారక చెరువులు బోసిపోతున్నాయి. చాన్నాళ్ల క్రితం దామలచెరువు నుంచి పాకాల వరకు చెరువులు నింపడానికి దామలచెరువు పెద్ద వంకపై ఛానల్ నిర్మించి పాకాల వరకు కాలువ తవ్వారు. ఈ ఛానల్‌లో నీరు పారితే మల్లప్పగారిపల్లె సమీపంలోని కుళ్లప్పరెడ్డి చెరువు, గుమ్మడివారిఇండ్లు సమీపంలోని మల్లెల చెరువు, ఊట్లవారిపల్లె సమీపంలోని తడకర చెరువు, పాకాల సమీపంలోని రామసముద్రం చెరువు, పాకాల పెద్దచెరువు నిండుతాయి. తాగు సాగునీరు పుష్కలంగా ఉంటుంది. భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావుల్లో నీళ్లు సమృద్ధిగా వుంటాయి. పదిపుట్లబైలు, కల్లూరు పరిసరాల అటవీ ప్రాంతంలో కురిసిన వర్షాలకు దామలచెరువు పెద్దవంకలో నీరు సమృద్ధిగా ప్రవహిస్తున్నా సప్లయ్ ఛానల్ సరిగా లేకపోవడంతో వృథాగా ఎన్టీఆర్ జలాశయానికి చేరుతున్నాయి. ఆపైన పొన్నై వంకకు వెళ్లిపోతున్నాయి. సుమారు ఏడే కిలోమీటర్ల మేర వున్న సప్లయ్ ఛానల్‌లో పలుచోట్ల లైనింగ్ వాల్ దెబ్బతిని శిథిలమైంది. ఎక్కడికక్కడ నీళ్లు వృథాగా పోతున్నాయి. పిచ్చిమొక్కలు ముళ్లకంపలతో నిండిపోయాయి. అక్కడక్కడ కాలువ పూడిపోయింది. ఊట్లవారిపల్లె సమీపంలో రోడ్డు విస్తరణలో కాలువ పూడ్చేశారు. దీంతో సప్లయ్ ఛానల్‌లో నీళ్లు చివరి వరకు వచ్చే అవకాశం లేదు. ఇరిగేషన్ అధికారులు స్పందించి సప్లయ్ ఛానల్‌కు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుకుంటున్నారు.

వైభవంగా నాగలింగేశ్వరస్వామి నగరోత్సవం



నాయుడుపేట టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట స్వర్ణ ముఖినది తీరాన వెలసిన్న ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నాగలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి రెండవ రోజు ఆదివారం ఉదయం ప్రధాన కలశారాధన, అగ్ని ప్రతిష్ఠ, ప్రత్యేకహోమాలు, మహాస్నపనం నిర్వహించారు. సాయంత్రం మంగళవాయిద్యాల, మంత్రోచ్ఛరణల నడుమ నాగలింగేశ్వరస్వామి వైభ వంగా నగరోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి, గురుస్వామి బాలాజీ, రాధయ్య, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, అవధానం సుధీర్ పాల్గొన్నారు.

గిడిగి జలపాతంలో పడి ఒకరి మృతి



వి.కోట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాలుజారి జలపాతంలోపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వి.కోట మండలం చిన్నాగనపల్లెకు చెందిన శ్రీనివాసులు (42) శాంతిపురంలోని హోటల్‌లో పనిచేసుకుంటున్నాడు. శనివారం సాయంత్రం సహచరులతో కలిసి వి.కోట మండలంలోని గిడిగి జలపాతానికి చేరుకున్నాడు. జలపాతం వద్ద శ్రీనివాసులు కాలుజారి పడటంతో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో అతడిని కాపాడేందుకు సహచరులకు సాధ్యపడలేదు. సమాచారం అందుకున్న సీఐ సోమశేఖర్ ఆదివారం ఉదయం సిబ్బందితో జలపాతం వద్దకు చేరుకొని పరిశీలించారు. పలమనేరు అగ్నిమాపక సిబ్బంది సాయంతో అతి కష్టంపై మృతదేహాన్ని బయటకుతీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జలపాతం వద్ద నీటి ఉధృతి అధికంగా ఉందని.. పర్యాటకులు తగిన జాగ్రత్తలు పాటించాలని సీఐ సూచించారు.

నేడు జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కింద జిల్లాకు రాష్ట్రస్థాయిలో ఆరు, జిల్లా స్థాయిలో 48 అవార్డులు దక్కాయని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. పరిశుభ్రత రంగంలో విశిష్టమైన సేవలందించిన అధికారులు, శానిటరీ వారియర్స్, గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీలు, మునిసిపాలిటీ, ప్రభుత్వ కార్యాలయాలకు అవార్డులు లభించాయన్నారు. రాష్ట్రస్థాయి అవార్డులను సోమవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా కుప్పం, పలమనేరు మునిసిపల్ కమిషనర్లు, శాంతిపురం మండలం కెనమాకులపల్లె గ్రామ పంచాయితీ సర్పంచ్, ఐరాల మండలం కామినాయని పల్లె అంగన్వాడీ కార్యకర్త, కుప్పం కడా అధికారి, చిత్తూరు ఆర్టీసీ బస్‌స్టేషన్ అధికారులు అవార్డులు అందుకోనున్నారని వివరించారు. అవార్డుల పంపిణీ కార్యక్రమం చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో మధ్యాహ్నం జరుగుతుందని పేర్కొన్నారు.

వరసిద్ధుడి సేవలో సమాచార హక్కు చట్టం కమిషనర్

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ చావలి సునీల్ ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

● ఐదుగురి అరెస్టు

డక్కిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) డక్కిలి శివారు ప్రాంతంలోని అడవిలో పేకాట స్థావరంపై ఎస్ఐ శివ శంకర్ తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, రూ.34,650 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

శాంతిపురంలో 86.4 మి.మీ వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 18 మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శాంతిపురం మండలంలో అత్యధికంగా 86.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. వి.కోటలో 38, రామకుప్పంలో 24.8, సదుంలో 20.6, రొంపిచెర్లలో 17.8, కుప్పంలో 12, గుడుపల్లెలో 10.4, విజయపురంలో 10.2, చిత్తూరు అర్బన్‌లో 4.2, కార్వేటినగరంలో 3.4, పెనుమూరు, పుంగనూరు, నింద్రలో 3.2, బంగారుపాళ్యంలో 3, నగరిలో 2.2, పెద్దపంజాణిలో 2, గంగవరంలో 1.8, గుడిపాలలో ఒక మి.మీ వర్షపాతం నమోదైంది.

సాఫీగా ఏపీపీ పరీక్ష

అమరావతి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 42అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ) పోస్టులకు జరిగిన రాత పరీక్ష సాఫీగా ముగిసింది. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు నాలుగు కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 1,494మంది అభ్యర్థులు హాజరైనట్లు రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా తెలిపారు. పరీక్షకు సంబంధించిన ఆన్సర్ కీ సోమవారం మధ్యాహ్నం 12గంటలకు విడుదల చేస్తామని చెప్పారు. అభ్యంతరాలున్న వారు ఈ నెల 8లోగా ఎస్ఎల్‌పీఆర్‌బీకి మెయిల్ ద్వారా తెలియజేయాలని సూచించారు. అర్హత మార్కులు సాధించిన వారికి త్వరలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

కోటమ్మకు పూజలు



కోట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషే కాలు చేసి చందన, పుష్పాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలక మండలి తీర్థప్రసాదాలు పంపిణీ చేసింది.

ప్రభుత్వ భూముల్లో ఆగని ఆక్రమణల పర్వం







తుమ్మలగుంట చెరువుకట్ట ఆనుకుని నిర్మాణం- వేదాంతపురంలో కాలువ స్థలంలో- చిగురువాడ దక్షిణపు కండ్రిగలో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డు

తిరుపతి రూరల్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలో ప్రభుత్వభూముల ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. నగరానికి చేరువగా నివాసానికి యోగ్యంగా ఉండడం, భూముల ధర పెరగడంతో అదను చూసి అక్రమ నిర్మాణాలకు తెరలేపుతున్నారు. ●తుమ్మలగుంటలో సర్వేనంబరు 60లోని చెరువుస్థలంలో పక్కాభవన నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఇదేసర్వేనెంబరులో ప్రభుత్వం తనకు గతంలో హౌస్‌సైట్ పట్టా ఇచ్చిందని నిర్మాణదారుడు అంటున్నారు. చెరువు కట్టకి ఆనుకుని చేపడుతున్న ఈస్థలానికి మాత్రం సర్వేనంబరు 59/1లో పంచాయతీ అప్రూవల్, ప్లాన్ పొందారన్నది అధికారిక సమాచారం. పక్కనే ఉన్న ఖాళీస్థలంలో(చెరువు) కొందరు నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ● వేదాంతపురం పంచాయతీలో సర్వేనంబరు 208లోని కాలువస్థలంలో ఇటీవల తాత్కాలిక రేకులషెడ్డుని నిర్మించారు. ఈ కాలువమీదుగా కాలనీ డ్రైనేజీ నీరు వెళుతుంది. ఇప్పుడు కాలువకు అడ్డుగా తాత్కాలిక నిర్మాణాన్ని చేపట్టినా పట్టించుకోలేదు. ●చిగురువాడ దక్షిణపుకండ్రిగలో సర్వేనంబరు 330/6లో 1.38ఎకరాల భూమిని ఓరైతుకి ప్రభుత్వ పట్టా ఇచ్చింది. దీన్ని వ్యవసాయభూమిగా సాగుచేసుకోవచ్చు. పక్కనే ఉన్న పట్టాభూమి నంబరుతో దీన్ని రిజిస్ట్రేషన్ చేసి క్రయవిక్రయాలు చేపట్టారని సమాచారం. ఇప్పటికే దీనిలో తాత్కాలిక రేకుల షెడ్డు నిర్మించారు.

ఆక్రమిస్తే ఉపేక్షించేదిలేదు

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేదిలేదు. నదీ, చెరువు భూములు జలవనరులశాఖ పరిధిలో ఉన్నాయి. వీఆర్వోలను క్షేత్రస్థాయికి పంపించి పరిశీలిస్తాం. వారి నివేదిక మేరకు చర్యలు తీసుకుంటాం.

-రామాంజులునాయక్, తహసీల్దార్

మొండి బకాయిలపై డీసీసీబీ దండన మంత్రం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)కు మొండి బకాయిల సెగ తప్పడం లేదు. ఆప్కాబ్ నుంచి తెచ్చిన రుణాలను డీసీసీబీ కింద ఉన్న ప్రాథమిక సహకార పరపతి సంఘాల(సింగిల్ విండోల) ద్వారా రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక పంట రుణాలుగా ఇస్తుంది. వీటిని సింగిల్ విండోలు, సిబ్బంది కలిసి సకాలంలో వసూలు చేసి డీసీసీబీకి జమచేయాలి. అయితే సింగిల్‌విండోల్లోని పాలకవర్గాలు బినామీ రైతుల పేరిట వారే భారీగా రుణాలు వాడేశారు. దీనివల్ల రూ.102 కోట్ల వరకు మొండి బకాయిలు పెరిగిపోయాయి. డీసీసీబీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.137 కోట్ల మేర పంపిణీ చేసిన వ్యవసాయ రుణాల్లో ఇప్పటివరకు రూ.35 కోట్లను మాత్రమే వసూలు చేశారు. ఏళ్ల తరబడి రూ.102 కోట్లు వసూలు కాలేదు. రుణగ్రహీతల జాబితాలోని 280 మందిలో సుమారు 30 మంది రూ.40 కోట్లు చెల్లించాల్సిఉంది. అప్పటి ప్రభుత్వం అమూల్ సంస్థ కోసం పాడిరుణాల పేరిట వెయ్యి మందికి రూ.12కోట్లను అందజేశారు. ఇందులో అతికష్టంపై రూ.6 కోట్లు వసూలు చేయగా, మరో 650 మంది నుంచి ఇంకా రూ.6 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

పథకాలకు లంకెపెట్టి

ప్రభుత్వ పథకాల అమలుకు డీసీసీబీకి లంకెపెడుతున్నారు. ఇలా గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ యంత్ర పరికరాలపై లబ్ధిదారులకు రాయితీపై రుణాలు మంజూరు చేశారు. 250 గ్రూపులకు సంబంధించి 866 మంది డీసీసీబీ నుంచి తీసుకున్న రుణాల్లో రూ.4కోట్ల వరకు బకాయిలున్నాయి. చాలామంది వ్యవసాయ రుణాలను సొంత వ్యాపారాలు, ఇతర అవసరాలకు వినియోగించుకున్నారు. వాయిదాలు చెల్లించమంటే రాజకీయ అండతో ఎదురుతిరుగుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా.. వడ్డీ పెరుగుతున్నా.. రుణం రెట్టింపైనా.. వారిలో ఏ మాత్రం స్పందన లేదు. కొందరైతే దౌర్జన్యానికి సైతం వెనుకాడడం లేదు. అలాంటివారిపై చట్టపరమైన చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు.

రికవరీ బృందాల ఏర్పాటు

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా అమాస రాజశేఖర్‌రెడ్డిని నియమించాక రుణ వసూళ్లపై దృష్టి పెట్టారు. రైతులకోసం ఏర్పాటు చేసుకున్న బ్యాంకు దుస్థితిని నేతలకు వివరించి సహకరించాలని కోరారు. ఏజీఎం, చీఫ్ మేనేజర్ స్థాయి అధికారుల పర్యవేక్షణలో డీసీసీబీ బ్రాంచ్‌ల్లో పనిచేస్తున్న సిబ్బంది, సూపర్‌వైజర్లు, సింగిల్‌విండో ఉద్యోగులతో బృందాలు ఏర్పాటు చేసి, రికవరీ మొదలుపెట్టారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందుగా పుంగనూరు, బైరెడ్డిపల్లె, పలమనేరు, వి.కోట, మదనపల్లె డీసీసీబీ బ్రాంచుల ద్వారా పంట రుణాల పేరిట రూ.20 కోట్లు మంజూరు చేశారు. రైతుల భూమిని బ్రాంచ్ మేనేజర్లు తనఖా పెట్టుకుని రుణాలు ఇవ్వాలి. అప్పటి వైసీపీ నేతల సిఫారసు మేరకు ఇష్టానుసారం రుణాలు మంజూరు చేశారు.

మొండి బకాయిలు వసూలు చేస్తాం



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సకాలంలో రుణాలు చెల్లించక.. నిరర్థక ఆస్తులు(ఎన్పీఏ)గా గుర్తించిన రూ.102 కోట్ల వసూలుకు నోటీసులిచ్చాం. రికవరీ బృందాలను ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

- సి.శంకర్ బాబు, డీసీసీబీ సీఈవో, చిత్తూరు.

పూర్వ జ్ఞాపకాలతో సావనీర్ ఆవిష్కరణ



తిరుపతి(కల్చరల్), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : పూర్వ బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయుల జ్ఞాపకాలు, అనుభవాలు, ఛాయాచిత్రాలతో ఒన్ లాస్ట్ టైమ్ పేరుతో రూపొందించిన సావనీరును పద్మావతి మహిళా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ కమలా మీనన్ ఆవిష్కరించారు. తిరుపతి కపిలతీర్థం సమీపంలోని గోల్డన్ తులిప్ హోటల్‌లో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. 2018లో నిర్వహించిన తొలి సమావేశానికి కొనసాగింపుగా దీన్ని నిర్వహించినట్లు కమలామీనన్ తెలిపారు. పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జ్ఞాపకాలను పంచుకున్నారు. జయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



తిరుపతి అర్బన్, అక్టోబర్ 5(ఆంధ్రజ్యోతి): తిరుమల ఎస్వీ హైస్కూల్లో 1985-86 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు నాలుగు దశాబ్దాల తర్వాత స్థానిక వరదరాజనగర్‌లోని మెడికల్ హాల్లో ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించు కుంటూ క్షేమ సమాచారం తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. అందరూ కలిసి విందుభోజనం చేశారు.

విద్యుత్ ఉద్యోగులు పోరాటానికి సిద్ధం కావాలి

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ ఉద్యోగులు రెండవ దశ పోరాటానికి సిద్ధం కావాలని విద్యుత్ జేఏసీ సర్కిల్ నేత జి.ఏలుమలై ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర జేఏసీ నాయకుల నిర్ణయం మేరకు సర్కిల్ పరిధిలో ఆందోళనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సోమవారం విశాఖ ఈపీడీసీఎల్ కార్యాలయం, బుధవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేయనున్నట్లు వివరించారు. 13న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించడానికి జేఏసీ నిర్ణయించిందని పేర్కొన్నారు. 15వ తేదీ తర్వాత నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని కోరారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు సుధాకర్, అశోక్‌కుమార్

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ జనశక్తి విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్(జనసేన అనుబంధం) నాయకులు ఎ.సుధాకర్, టి.అశోక్‌కుమార్ తెలిపారు. తిరుపతి ఏపీఎస్ఈబీ ఇంజనీరింగ్ అసోసియేషన్ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి నాయకులు కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయి నుంచి ఉద్యోగుల సమస్యలపై పోరాటానికి సంఘం సిద్ధంగా ఉంటుందని చెప్పారు. కాంట్రాక్టు, రెగ్యులర్ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు పవన్‌కుమార్, ఇ.వెంకటాద్రి, శ్రీరామ్ మల్లికార్జున, సోమశేఖర్, జి.రమేష్‌బాబు, కేవీ ప్రసాద్, మునిరామకృష్ణ పాల్గొన్నారు.

వెంకటకిషోర్ యాదవ్‌కు నివాళి



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన స్విమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.వెంకటకిషోర్ యాదవ్‌కు గీతా గోవిందం సేవా సమితి నిర్వాహకులు ఆదివారం నివాళి అర్పించారు. స్థానిక యూత్ హాస్టల్‌లో ఆదివారం సమితి ఆధ్వర్యంలో సంతాపసభ ఏర్పాటు చేశారు. సమితి నిర్వాహకులు, స్నేహితులు ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. వైద్య వృత్తిపట్ల ఆయన నిబద్ధత, సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీనివాసులు, ఇంజనీరు దామోదరం, బాలగుర్రప్ప, బి.భాస్కర్, మధుసూదన్, గోపాల్, ఉమాపతి, గుణశేఖర్, రామచంద్రయ్య, మునీంద్ర పాల్గొన్నారు.

రెండు బైకుల ఢీ

- ఇద్దరు యువకుల దుర్మరణం
- ఒకరికి గాయాలు



సాయికిరణ్, యుగంధర్ (ఫైల్‌ఫొటోలు)



సంఘటన స్థలంలో యువకుల మృతదేహాలు

వెదురుకుప్పం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా, ఒకరికి గాయాలయ్యాయి. ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలంలోని కొమరుగుంట గ్రామ పంచాయతీ సామిరెడ్డికండ్రిగకు చెందిన యుగంధర్(19) బైక్‌లో స్వగ్రామం నుంచి పచ్చికాపల్లం మీదుగా ఆదివారం తిరుపతికి వెళ్తున్నాడు. అదే సమయంలో తిరుపతి జిల్లా దుర్గసముద్రం వద్ద వడ్డి ఇండ్లుకు చెందిన సాయికిరణ్(23) తన స్నేహితుడితో కలసి బైక్‌లో తిరుపతి వైపు నుంచి పచ్చికాపల్లంకు వస్తున్నాడు. సాయంత్రం బొమ్మనదొడ్ల క్రాస్ రోడ్డు వద్దకొచ్చేసరికి ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వాహనాలు నడుపుతున్న సాయికిరణ్(23), యుగంధర్(19)లు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. బైక్‌లో వెనుక వైపు ఉన్న తేజ(17) గాయపడటంతో చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. తేజ స్వగ్రామం వివరాలు తెలియలేదు. మృతులకు వివాహం జరగలేదని సమాచారం. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



గాయపడ్డ తేజ

తిరుపతి

నేటి నుంచి జాతీయ పోస్టల్ వారోత్సవాలు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రధాన తపాలా కార్యాలయంలో సోమవారం నుంచి 10వ తేదీ వరకు జాతీయ పోస్టల్ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తిరుపతి డివిజన్ ఎస్‌పీవోస్ మేజర్ సైద తన్వీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి డివిజన్‌లో 8నుంచి 14వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

సీఎం పర్యటనలో భద్రతా లోపాలు ఉండరాదు

అధికారులకు ఎస్పీ ఆదేశం



నారావారిపల్లెలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ శుభం బన్సల్, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో ఎటువంటి భద్రతా లోపాలు లేకుండా చూడాలని ఎస్పీ సుబ్బరాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలసి ఆయన ఆదివారం స్థానిక పోలీసు అతిథి గృహంలో సీఎం సెక్యూరిటీ అధికారులు, ఇంటెలిజెన్సు, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, ఫైర్, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్, రవాణా శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ మంగళవారం సీఎం కుటుంబ సభ్యులతో కలసి వస్తున్నందున మంత్రులు, వీవీఐపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు వచ్చే అవకాశాలున్నాయని, దానికి తగినట్లు భద్రతా ఏర్పాట్లు కల్పించాలన్నారు. సోమవారం మధ్యాహ్నానికి ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు. జేసీ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు వారికి అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించి కార్యక్రమం విజయవంతమయ్యేలా పనిచేయాలని ఆదేశించారు. అంతకు ముందు నారావారిపల్లెలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, ఇంటెలిజెన్సు వెంకటరాముడు, శ్రీనివాసరావు, డీఎస్పీలు వెంకటనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

చూపులేకున్నా..తగ్గేదే లే..

- స్కేటింగ్‌లో దూసుకువెళ్తున్న హర్షవర్ధన్
- అసమాన ప్రతిభతో ఓ బాలుడి సాహస విన్యాసం
- ప్రపంచ రికార్డు సాధన దిశగా సన్నాహం



రోడ్డుపై స్కేటింగ్ చేస్తున్న హర్షవర్ధన్

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పేదరికం, అంధత్వం.. ఇవేమీ ఆ పదకొండేళ్ల కుర్రాడికి అడ్డం కాలేదు. కాళ్లకు చక్రాలు కట్టుకుని దూసుకుపోతున్నాడు. 'నీ ధైర్యాన్ని దర్శించి దైవాలే తలదించగా' అని ఓ సినిమా కవి అన్న మాటల్ని నిజం చేస్తున్నాడు. స్కేటింగ్‌లో విశేష ప్రతిభ కనబరుస్తూ ప్రపంచ రికార్డు సృష్టించడానికి సన్నద్ధమవుతున్నాడు హర్షవర్ధన్. ఏర్పేడు మండలం మహంకాళీదేవి పుత్తూరు(ఎండీ పుత్తూరు)కు చెందిన రాజకుమారి, మునిబాబు దంపతులది రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం. మొదటి కుమారుడు మునిచరణ్‌కు మూగ, చెముడు. రెండో కుమారుడు హర్షవర్ధన్ అంధత్వంతో జన్మించాడు. ఇద్దరు దివ్యాంగులే పుట్టారంటూ భర్త చికాకుపడేవాడు. బంధువులూ ఈసడించుకునేవారు. అయినా రాజకుమారి ఇసుమంత బాధను కూడా దరిచేరనివ్వలేదు. ఓ ప్రయివేట్ స్కూలులో ఆయాగా చేస్తూ బిడ్డలిద్దరినీ కంటికి రెప్పగా సాకుతోంది. తిరుచానూరు రోడ్డులోని నవజీవన్ పాఠశాలలో చేర్పించింది.

చూపులేని స్కేటింగ్ లక్ష్యం

నవజీవన్‌లో కోచింగ్ ఇస్తున్న టాలెంట్ స్కేటింగ్ అకాడమీ(పుత్తూరు) కోచ్ ప్రతాప్ దృష్టి హర్షవర్ధన్‌పై పడింది. అతని ఉత్సాహానికి ముచ్చటపడి తానే కిట్లు, ఇతర సామగ్రిని సమకూర్చారు. చూపులేకుండా స్కేటింగ్ చేయడం సాహసం, ప్రమాదమని తెలిసినా హర్షవర్ధన్ కూడా ఎక్కడా తగ్గలేదు. కఠోర పరిస్థితులను అధిగమిస్తూ శిక్షణ పొందాడు. నెల రోజుల్లోనే ప్రాథమిక మెలకువలను నేర్చేశాడు. బాలుడి ప్రతిభను ప్రతాప్ గ్రహించి తనతో తీసుకువెళ్లి నాలుగు నెలలుగా తర్ఫీదునిస్తున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పుత్తూరు నుంచి నాగలాపురం వరకూ రానూపోనూ స్కేటింగ్ సాధన చేస్తున్నాడు. అంటే దాదాపు 50 కిలోమీటర్ల దూరాన్ని అలుపు లేకుండా ఛేదిస్తున్నాడు. రోడ్డు అంచుల్లో వేసిన తెల్లటిరంగుపై స్టిక్‌తో రాసుకుంటూ ముందుకు కదులుతున్నాడు. గంటకు దాదాపు 20 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నాడు. గురువు ప్రతాప్ వెనుకనే కారులో అనుసరిస్తూ సూచనలిస్తున్నాడు.



కోచ్ ప్రతాప్ శిక్షణలో స్కేటింగ్ చేస్తున్న హర్షవర్ధన్

ప్రపంచ రికార్డుకు సన్నాహాలు

గ్లోబల్, వజ్ర, హిందూస్తాన్, వండర్‌వరల్డ్, జీనియస్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సంస్థలకు హర్షవర్ధన్ వీడియోలను పంపారు. వారినుంచి అంగీకారం లభించింది. త్వరలో జరిగే పోటీకి తేదీ ఖరారు కాలేదు. ఈ ఆరు సంస్థల ప్రతినిధుల పర్యవేక్షణలో ఆంధ్రా, కర్ణాటక సరిహద్దు నంగిలి చెక్‌పోస్టు వద్ద బయల్దేరి చిత్తూరు, తిరుపతి, వడమాలపేట, పుత్తూరు, నారాయణవనం, పిచ్చాటూరు, నాగాలాపురం, పుత్తూరుకు(220కిలోమీటర్ల) స్కేటింగ్ చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పాలనే లక్ష్యంగా హర్షవర్ధన్‌కు శిక్షణ ఇచ్చానని కోచ్ తెలిపారు. పోటీ జరిగే రోజు ఉదయం 6గంటలకు బయల్దేరితే రాత్రి 11గంటలకు స్కేటింగ్ ముగిస్తుందని భావిస్తున్నారు.

ఇద్దరూ ఉన్నతంగా బతకాలనేది ఆకాంక్ష



తల్లితో మునిచరణ్, హర్షవర్ధన్

తిరుపతిలోని ఆకుతోటవీధిలో అద్దె ఇంట్లో ఉంటున్నాం. రోజు నేను పనిచేసే స్కూల్‌వ్యాన్‌లోనే పిల్లలను తీసుకెళ్లి, తీసుకువస్తాను. 2016లో సీఎం చంద్రబాబు అందించిన దాదాపు రూ.10లక్షలతో పెద్దకుమారుడికి చెవి యంత్రం అమర్చగలిగాం. పిల్లలిద్దరికీ దివ్యాంగుల పింఛను ఆసరాగా నిలుస్తోంది. విధి వెక్కిరించినా ఇద్దరూ గొప్పగా బతకాలని కోరుకుంటున్నాను. మంచి భవిష్యత్తు అందివ్వాలని తపన పడుతున్నాను. ఆధారం లేకుండా స్వశక్తితో బతకాలనుకుంటున్నాడు. నా ఆకాంక్ష నేరవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. - రాజకుమారి, హర్షవర్ధన్ తల్లి

ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో నాన్‌స్టాప్ ఏంటి..!?

ప్రయాణికుల్లో అయోమయం

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి-శ్రీకాళహస్తి మధ్య నడిచే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులకు నాన్‌స్టాప్ బోర్డులు పెట్టడంతో స్త్రీశక్తి పథకం వర్తిస్తుందా లేదా తెలియక మహిళలు అయోమయానికి గురవుతున్నారు. దీనిపై ఫిర్యాదులు వస్తుండటంతో ప్రజారవాణాధికారి జగదీష్ వివరాలు సేకరించారు. ఈ మార్గంలో 9 పల్లె వెలుగు సొంత బస్సులు, 5 అద్దె బస్సులు, నాన్‌స్టాప్ పేరుతో ఎక్స్‌ప్రెస్ 2 సొంత బస్సులు, 2 అద్దె బస్సులు నడుస్తున్నాయి. కొన్నేళ్లుగా కొనసాగుతున్న నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ బస్సులతో ప్రస్తుతం ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్లాట్‌ఫామ్ వద్దకు రాగానే ఎక్స్‌ప్రెస్ బస్సే కదాని ప్రయాణికులు ఎక్కి కూర్చున్నాక డిస్పాచర్ వచ్చి ఇది నాన్‌స్టాప్ బస్సు అని, ఇందులో స్త్రీశక్తి పథకం వర్తించదని చెబుతుండటంతో ఇబ్బంది పడుతున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సులకు నాన్‌స్టాప్ బోర్డు పెట్టడమేంటని ఆర్టీసీ సిబ్బందితో గొడవకు దిగుతున్నారు. దీంతో ఈ సమస్యకు పరిష్కార మార్గం గురించి డీపీటీవో అధికారులతో సమాలోచనలు జరుపుతున్నారు. రేపోమాపో ఆ బస్సుల్లోనూ స్త్రీశక్తి పథకం అమలుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా స్త్రీశక్తి పథకం వర్తించని నాన్‌స్టాప్ మెట్రో బస్సులు 14, అల్ట్రా డీలక్స్‌లు 6, సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులు 25 నడుస్తున్న విషయం తెలిసిందే. విస్తృతంగా ప్రచారం కల్పించడంతో ఈ బస్సులతో సమస్యలు లేవు.

ఎవరా ముసుగు దొంగలు?

- స్థానికులేనని గుర్తించిన పోలీసులు
- తిరుపతిలో 10 ముఠాలు ఉన్నట్లు సమాచారం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శనివారం సాయంత్రం రెండు గంటల వ్యవధిలో ఐదు చోట్ల చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన ముసుగు దొంగలు ఎవరు? ఈ దిశగా పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. వారు స్థానికులేనని ప్రాథమికంగా గుర్తించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా వారు వాడుతున్న ద్విచక్రవాహనం తిరుపతిలో రిజిస్ట్రేషన్ అయినట్లు తెలిసింది. మొత్తం 10 ముఠాలు తిరుపతిలో తిష్ట వేసినట్లు సమాచారం. ఈ ముఠాలు ఒక పథకం ప్రకారం దొంగతనాలకు పాల్పడుతున్నట్లు భావిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ఐదు ప్రాంతాల్లో ఇద్దరు యువకులు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడడంపై ఎస్పీ సుబ్బరాయుడు సీరియస్‌గా తీసుకున్నారు. బాధ్యులైన పోలీసు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడెక్కడ చైన్ స్నాచింగ్‌లు జరిగాయి? ఆ ప్రాంతాల్లో ఎవరెవరు అనుమానితులు తిరుగుతున్నారు? వారు వినియోగిస్తున్న ద్విచక్ర వాహనం రిజిస్ట్రేషన్ నెంబరు ఎక్కడది అనే వివరాలు గుర్తించి నిందితులను పట్టుకోవడానికి పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరితగతిన నిందితులను పట్టుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదివారం ఉదయం జరిగిన టెలికాన్ఫరెన్సులోనూ ఎస్పీ ఆదేశించారు. దీంతో డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది టీమ్‌లుగా విడిపోయి గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు నిందితులు అందరూ తిరుపతికి చెందిన ముఠాలుగా పోలీసులు గుర్తించారు. వీరికి బడా ముఠా నాయకుడు వెనుక వుండి చేయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సర్వే అకాడమి భూమిని పేదలకివ్వాలి

వామపక్ష నేతల ఆందోళన



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహన్

తిరుపతి అర్బన్, అక్టోబర్ 5(ఆంధ్రజ్యోతి): సర్వే అకాడమీకి కేటాయించిన 42 ఎకరాలను పేదల ఇళ్లస్థలాలకు కేటాయించాలని వామపక్ష నేతలు ఆదివారం ఆందోళన చేపట్టారు. మంగళంలోని తిరుమల నగర్ పంచాయతీ పరిధి చెన్నాయిగుంట గ్రామ లెక్కదాఖల సర్వే నెంబర్ 195/2/4లో 42 ఎకరాలను 2021లో అప్పటి ప్రభుత్వం సర్వే అకాడమీకి కేటాయించింది. అయితే మంగళం వాసులకు జగనన్న ఇళ్లస్థలాలను నగరానికి 20 కిలోమీటర్ల దూరంలో కేటాయించారు. కూతవేటు దూరంలో ఉన్న స్థలాన్ని సర్వే అకాడమీకి ఇచ్చారు. దీన్ని అప్పట్లోనే ప్రజలు వ్యతిరేకించారు. సర్వే అకాడమి నిర్మాణం మూలన పడటం, తాము అధికారంలోకి వస్తే ఆ భూమిలో ఎన్టీఆర్ గృహ సముదాయాన్ని నిర్మించి పేదలకు ఇస్తామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అప్పట్లో హామీ ఇచ్చారు. ప్రభుత్వం కొలువుదీరి 16 నెలలు కావస్తున్నా ఆ దిశగా అడుగులు పడకపోవడంతో జగనన్న కాలనీల బాధితులు, వామపక్ష నాయకులు, కార్యకర్తలు ఎర్రజెండాలు ప్రదర్శిస్తూ ర్యాలీగా సర్వే అకాడమీ ల్యాండ్ వద్దకు చేరుకున్నారు. ముందుగానే సమాచారం అందుకున్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. వాదోపవాదాలు జరిగాయి. ఆందోళనకారులు రోడ్డుపై బైఠాయించారు. ఆర్డీవో రామ్మోహన్, అర్బన్ తహసీల్దార్ సురేష్‌బాబు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. సీపీఎం నేత కందారపు మురళి ఆధ్వర్యంలో బాధితులు వినతిపత్రం అందజేశారు. ఆరు నెలల్లో సమస్య పరిష్కరిస్తామని ఆర్డీవో హామీ ఇవ్వడంతో శాంతించారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర్ తిమ్మినాయుడుపాలెం బృందావన గార్డెన్ సమీపంలో ఆదివారం విద్యుదాఘాతంతో భవన కార్మికుడు చంద్రమౌళి(60) మృతిచెందారు. లక్ష్మీపురంలో నివాసం ఉంటున్న ఇతడు.. హరిబాబు అనే బిల్డర్ వద్ద ఓ భవన పునాది పనులకు డ్రిల్లింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. ఈ మేరకు అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి -చంద్రగిరి మధ్యలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని ఆదివారం గుర్తించారు. తిరుపతి రైల్వే హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ రెడ్డి వివరాల మేరకు.. రైలు పట్టాలపై మృతదేహం పడి ఉందన్న విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. తల, మొండెం వేరుగా పడి ఉన్నాయి. అతని వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదు. మృతుడి వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని భావిస్తున్నారు. రైల్వే స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు రైల్వే సీఐ 9440627638ను సంప్రదించాలని కోరారు.

డ్రైనేజీ కాలువల ఆక్రమణ

- రోడ్లపై పారుతున్న మురుగు

తిరుపతి అర్బన్, అక్టోబర్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కరకంబాడి రోడ్డుకిరువైపులా డ్రైనేజీ కాలువలు ధ్వంసమైపోయాయి. వాటిపై విచ్చలవిడిగా కట్టడాలు కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల ఆక్రమణకు గురికాగా, అనధికార దుకాణాలు, పెద్దపెద్ద షాపులకు ర్యాంపులు నిర్మించేశారు. వాటి కింద వ్యర్థాలు, ప్లాస్టిక్ పేరుకుపోతున్నాయి. ర్యాంపులు అడ్డుగా ఉండటంతో చెత్తను తొలగించలేని పరిస్థితి. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. పారిశుధ్యం లోపించడం, దుర్గంధం వెదజల్లుతుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య తెలిసినా నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కమిషనర్ స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





మురుగునీరు రోడ్డుపైకి చేరడంతో పాదచారుల ఇబ్బందులు

పుత్తూరు వార్తలు

రాళ్లు తేలిన గ్రామీణ రోడ్డు



గుంతలమయమైన ఓబీఆర్ కండ్రిగ నుంచి వసంతనగర్ వెళ్లే రోడ్డు

వడమాలపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధాన రహదారిగా ఉన్న రోడ్డు రాళ్లు తేలి ప్రయాణం నరక ప్రాయమవుతోంది. పంచాయతీ రాజ్ పరిధిలోని ఓబీఆర్ కండ్రిగ- వసంతనగర్ మధ్య తారు రోడ్డు కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో రాళ్లు తేలి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తరచూ రాత్రుల్లో వాహనదారులకు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈరోడ్డు సుమారుగా ఇరవై గ్రామాలకు వెళ్లేందుకు వడమాలపేట నుంచి దగ్గరి దారి. కాగా ఓబీఆర్ కండ్రిగ రోడ్డు - వసంతనగర్ మీదుగా అటు తడుకు ఆర్ఎస్ మీదుగా పుత్తూరు, ఇటు వడమాలపేట, అప్పాలాయగుంటకు దగ్గరి దారి. నిత్యం రద్దీగా ఉండే ఈరోడ్డుపై ద్విచక్ర వాహనాలపై ప్రయాణం సర్కస్ ఫీట్లను తలపిస్తోంది. తరచూ ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ రోడ్డు కూటమి ప్రభుత్వంలోనైనా బాగుపడుతుందేమో అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

పేదలకు ఆర్థిక చేయూతే టీడీపీ లక్ష్యం



నగరిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే భాను

వడమాలపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పేదలకు ఆర్థికంగా చేయూత అందించడమే టీడీపీ లక్ష్యమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. ఆదివారం నగరిలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేశారు. ఈ సందర్భంగా వడమాలపేట మండలానికి చెందిన 24 మందికి ఆర్థిక సాయం అందించినట్లు చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు చెప్పారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలందరికీ ఎమ్మెల్యే భాను సాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమం లో లక్ష్మీప్రసన్న, రవిరెడ్డి, గిరినాయుడు, శ్యామయ్య తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు




దర్శనానంతరం ధ్వజ స్తంభం వద్ద
కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ గీతా కదాబ, నటుడు సుమన్

శ్రీకాళహస్తి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని ఆదివారం సినీనటుడు సుమన్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించిస్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

- స్వామి అమ్మవార్లను ఆదివారం కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ గీతా కదాబ భారత రాజా సెట్టర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.
- శ్రీకాళహస్తి పట్టణంలోని హజ్రత్ జులేషా పీర్ దర్గాను ఆదివారం సినీనటుడు సుమన్ దర్శించుకున్నారు. దర్గా ఉరుసు కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. ఆయన దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. సయ్యద్ అహ్మద్, సయ్యద్ బాబా ఫరీద్, ఓరుగంటి నాగేశ్వరరావు, గుమ్మళ్ల రాజేశ్వరరావు, గరికపాటి రమేష్, షాకీరాలీ, జమ్రుద్ బాదుషా పాల్గొన్నారు.

రెండు ఆలయాలకు పాలకమండళ్ల నియామకం



వెంకటేశులు - సుబ్రహ్మణ్యం

పిచ్చాటూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుప్రసిద్ధ శివాలయం రామగిరి వాలీశ్వర స్వామి ఆలయ పాలక మండలి చైర్మన్‌గా కె.ఎల్.వెంకటేశులు, రామగిరి కుమార సుబ్రహ్మణ్య స్వామి ఆలయ పాలక మండలి చైర్మన్‌గా టి.ఎన్.సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. నియోజకవర్గంలో ఇటీవల జరు గుతున్న పరిణామాల కారణంతో శనివారం ఆలయ ఆవరణలో ప్రమాణ స్వీకారాలు కూడా చేసినట్లు సమాచారం. వీరితో పాటు ఒక్కో ఆలయానికి 8 మంది డైరెక్టర్లు నియమితులయ్యారు. డైరెక్టర్లలో టీడీపీ, జనసేన, బీజేపీలకు చోటు కల్పించారు.

న్యాయం చేయండి మహాప్రభో...



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ శ్రేణులు

మండలంలోని రామగిరి వాలీశ్వర స్వామి ఆలయం, సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల పాలకమండళ్లలో తమకు స్థానం కల్పించి న్యాయం చేయాలని పలువురు టీడీపీ శ్రేణులు కోరారు. పిచ్చాటూరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ఆగస్టు 15వ తేదీ నుంచి 28 వరకు నోటిఫికేషన్‌లో లాస్ట్ డేట్‌గా ప్రకటించిన దేవాదాయశాఖ అధికారులకు తాము ఇచ్చిన జాబితాను పక్కన పెట్టి, గడువు తీరిన తరువాత వారు ఇచ్చిన పేర్లను పాలకమండలిలో ప్రకటించడంపై ప్రశ్నించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వారే చైర్మన్లు, ప్రస్తుతం వారే ఆ పదవుల్లో కొనసాగడం భావ్యం కాదన్నారు. ఏకాంబరంరెడ్డి, రాజేంద్ర, గజేంద్ర, చంద్రయ్య, రవి, పాండియన్, అంబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతమ్మ ఉత్సవం

శ్రీకాళహస్తి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటకిందపల్లి హరిజనవాడలో మాతమ్మ కొలుపును మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పలు రకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు జి.మధురెడ్డి, మునికృష్ణారెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, వసల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఐదుగురి అరెస్టు
రూ.34,650 నగదు, 3 బైక్‌ల స్వాధీనం

డక్కిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) డక్కిలి శివారు ప్రాంతంలోని అడవిలో పేకాట స్థావరంపై ఎస్ఐ శివశంకర్ తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, రూ.34,650 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బాలాయపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జయంపు, మన్నూరు గ్రామాల్లో సోమవారం నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పీఆర్వో నందకిశోర్ తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మన్నూరు, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జయంపులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు.

డక్కిలిలో నేడు ఎమ్మెల్యే పర్యటన

డక్కిలి, అక్టోంబరు 5 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం దేవునివెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని సోమవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పర్యటిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వర రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు తెలిపారు. కుప్పాయపాళెంలో గోకులం షెడ్ల ప్రారంభోత్సవం, సీసీ రోడ్లుకు భూమిపూజ ఎమ్మెల్యే చేతుల మీదుగా జరుగుతాయని చెప్పారు.

జాతీయ రహదారిపైనే చెత్త

డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించినా కలగని మోక్షం ● కొరవడిన ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవ



జాతీయ రహదారిపై పోసిన చెత్త

సూళ్లూరుపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ డంపింగ్ యార్డు సమస్యకు ఇప్పట్లో పరిష్కారం లభించేలాలేదు. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని 25వార్డుల్లో 58 వేల పైగా జనాభా ఉంది. రోజుకు దాదాపు 22 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. మూడు దశాబ్ధాలుగా హోలిక్రాస్ సమీపంలోని జాతీయ రహదారిపై పక్కనే ఉన్న కాళంగి నది ఒడ్డున డంపింగ్ యార్డులో చెత్త వేస్తున్నారు. ఇక్కడ దాదాపు 38,261 టన్నులు చెత్త పేరుకుపోయింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పట్టణాల్లో ఎక్కడ చెత్త, వ్యర్థాలు కనబడకూడదనే ఉద్దేశంతో బయో మైనింగ్ ద్వారా శుద్ధి చేయడం ప్రారంభించారు. దీని ద్వారా సాలిడ్స్, మెటల్, ప్లాస్టిక్‌ను వేరుచేసి బయటకు తరలిస్తున్నారు. ఈ ప్రక్రియ సైతం పూర్తయ్యింది. ఇదిలా ఉండగా మున్సిపాలిటీలో ఉత్పత్తి అయ్యే చెత్తను పోసేందుకు కొణ్ణంబట్టు వద్ద పది ఎకరాల స్థలాన్ని డపింగ్ యార్డుకు కేటాయిస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఆ భూముల్లో చెత్త వేయరాదంటూ స్థానికులు అభ్యంతరం చెప్పారు. దీంతో డంపింగ్ యార్డు సమస్య మొదటికొచ్చింది. మున్సిపాలిటీ అధికారులు చేసేదేమీ లేక సూళ్లూరు సమీపంలో వాటంబేడు రోడ్డులో కాళంగి నది అంచునే చెత్తను వేస్తూవచ్చారు. అక్కడి ప్రజలు అభ్యంతర చెప్పడంతో ప్రస్తుతం బయోమైనింగ్ చేస్తున్న డంపింగ్ యార్డు జాతీయ రహదారిపైనే చెత్త పోస్తున్నారు. నిబంధనల ప్రకారం బయో మైనింగ్ చేస్తున్న స్థలంలో చెత్త వేయరాదని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు హెచ్చరికలు జారీ చేశారు. మున్సిపాలిటీ అధికారులు గత్యంతరం లేక అక్కడే చెత్త పోయడంతో జాతీయ రహదారిపైనే కుప్పలు కుప్పలుగా పేరుకుపోయింది. దీంతో వాహన దారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులకు ముందుచూపు లేకపోవడంతో డంపింగ్ యార్డుకు కలెక్టర్ కేటాయించిన స్థలాన్ని సమీప గ్రామస్తులతో మాట్లాడి వినియోగించుకోవడంలో పూర్తిగా విఫలం చెందారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దినదిన అభివృద్ధి చెందుతున్న సూళ్లూరుపేట పట్టణానికి డంపింగ్ పెద్ద సమస్యగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని పట్టణవాసులు కోరుతున్నారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు



కరపత్రాలను అందజేసి అవగాహన కల్పిస్తున్న నరసింహయాదవ్, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరిందని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక టవర్ క్లాక్‌సెంటర్, ముత్యాలపేట ప్రాంతాల్లో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని తగ్గించడంతో పలు వస్తువుల ధరలు తగ్గాయన్నారు. ప్రధానంగా నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్స్, వాహనాలు, రైతులకు వ్యవసాయ పరికరాలు ఇలా ఎన్నో వస్తువులు గతం కంటే తక్కువ ధరలకు లభ్యవవుతున్నాయన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం చేకూరేలా జీఎస్టీని తగ్గించడం జరిగిందన్నారు.అనేక సంక్షే మ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకెళుతున్న ఎన్డీఏ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, మట్టం శ్రావణి, బిల్లు చెంచురామయ్య, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, గుండాల లీలావతి, పెంచలయ్య, శ్రీదేవి, వాటంబేడు శివకుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత ధనుంజయరెడ్డి తల్లి మృతి



నవనీతమ్మ (ఫైల్‌ఫొటో)

ఓజిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం మానమాలకు చెందిన టీడీపీ నేత, కురుగొండ సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎద్దల ధనుంజయరెడ్డి తల్లి నవనీతమ్మ(82) ఆదివారం మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సమాచారం తెలుసుకున్న పలువురు టీడీపీ, వైసీపీ, బీజేపీ నాయకులు మానమాల గ్రామానికి వెళ్లి నవనీతమ్మ మృతదేహానికి నివాళులర్పించి ధనుంజయరెడ్డిని పరామర్శించారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు అందజేస్తున్న పెంచలనాయుడు

గూడూరు అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక బాలాజీనగర్ సెంటర్ వద్ద భారత్ వికాస్ పరిషత్ సౌత్ ఇండియా వైస్‌ప్రెసిడెంట్ కంకణాల పెంచలనాయుడు ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

నారాయణమ్మకు ప్రత్యేక పూజలు

గూడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీ కాలనీలోని నారాయణమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.


రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ పవన్‌కుమార్

కోట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పవన్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం కోట పోలీసుస్టేషన్ ప్రాంగణంలో మండలంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు పార్టీలకు అతీతంగా అందరితోనూ సఖ్యతగా మెలగాలన్నారు. ఎక్కడా వివాదాలకు వెళ్లకూడదని, గొడవలకు దూరంగా ఉండాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో నిఘా పెంచుతామని, ఎక్కడైనా తేడా వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్పష్టం చేశారు.

కోటమ్మకు పూజలు



కోట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

జగన్‌ను కలిసిన కలిమిలి

డక్కిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకుడు, వైసీపీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు కలిమిలి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనను పార్టీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

చూపులేకున్నా.. తగ్గేదే లే..

- స్కేటింగ్‌లో దూసుకువెళ్తున్న హర్షవర్ధన్
- అసమాన ప్రతిభతో ఓ బాలుడి సాహస విన్యాసం
- ప్రపంచ రికార్డు సాధన దిశగా సన్నాహం



రోడ్డుపై స్కేటింగ్ చేస్తున్న హర్షవర్ధన్



తల్లితో మునిచరణ్, హర్షవర్ధన్

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పేదరికం, అంధత్వం.. ఇవేమీ ఆ పదకొండేళ్ల కుర్రాడికి అడ్డం కాలేదు. కాళ్లకు చక్రాలు కట్టుకుని దూసుకుపోతున్నాడు. 'నీ ధైర్యాన్ని దర్శించి దైవాలే తలదించగా' అని ఓ సినిమా కవి అన్న మాటల్ని నిజం చేస్తున్నాడు. స్కేటింగ్‌లో విశేష ప్రతిభ కనబరుస్తూ ప్రపంచ రికార్డు సృష్టించడానికి సన్నద్ధమవుతున్నాడు హర్షవర్ధన్. ఏర్పేడు మండలం మహంకాళీదేవి పుత్తూరు(ఎండీ పుత్తూరు)కు చెందిన రాజకుమారి, మునిబాబు దంపతులది రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం. మొదటి కుమారుడు మునిచరణ్‌కు మూగ, చెముడు. రెండో కుమారుడు హర్షవర్ధన్ అంధత్వంతో జన్మించాడు. ఇద్దరు దివ్యాంగులే పుట్టారంటూ భర్త చికాకుపడేవాడు. బంధువులూ ఈసడించుకునేవారు. అయినా రాజకుమారి ఇసుమంత బాధను కూడా దరిచేరనివ్వలేదు. ఓ ప్రయివేట్ స్కూలులో ఆయాగా చేస్తూ బిడ్డలిద్దరినీ కంటికి రెప్పగా సాకుతోంది. తిరుచానూరు రోడ్డులోని నవజీవన్ పాఠశాలలో చేర్పించింది.

చూపులేని స్కేటింగ్ లక్ష్యం

నవజీవన్‌లో కోచింగ్ ఇస్తున్న టాలెంట్ స్కేటింగ్ అకాడమీ(పుత్తూరు) కోచ్ ప్రతాప్ దృష్టి హర్షవర్ధన్‌పై పడింది. అతని ఉత్సాహానికి ముచ్చటపడి తానే కిట్లు, ఇతర సామగ్రిని సమకూర్చారు. చూపులేకుండా స్కేటింగ్ చేయడం సాహసం, ప్రమాదమని తెలిసినా హర్షవర్ధన్ కూడా ఎక్కడా తగ్గలేదు. కఠోర పరిస్థితులను అధిగమిస్తూ శిక్షణ పొందాడు. నెల రోజుల్లోనే ప్రాథమిక మెలకువలను నేర్చేశాడు. బాలుడి ప్రతిభను ప్రతాప్ గ్రహించి తనతో తీసుకువెళ్లి నాలుగు నెలలుగా తర్ఫీదునిస్తున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పుత్తూరు నుంచి నాగలాపురం వరకూ రానూపోనూ స్కేటింగ్ సాధన చేస్తున్నాడు. అంటే దాదాపు 50కిలోమీటర్ల దూరాన్ని అలుపు లేకుండా ఛేదిస్తున్నాడు. రోడ్డు అంచుల్లో వేసిన తెల్లటిరంగుపై స్టిక్‌తో రాసుకుంటూ ముందుకు కదులుతున్నాడు. గంటకు దాదాపు 20కిలో మీటర్ల వేగంతో వెళ్తున్నాడు. గురువు ప్రతాప్ వెనుకనే కారులో అనుసరిస్తూ సూచనలిస్తున్నాడు.

ప్రపంచ రికార్డుకు సన్నాహాలు

గ్లోబల్, వజ్ర, హిందూస్థాన్, వండర్‌వరల్డ్, జీనియస్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సంస్థలకు హర్షవర్ధన్ వీడియోలను పంపారు. వారినుంచి అంగీకారం లభించింది. త్వరలో జరిగే పోటీకి తేదీ ఖరారు కాలేదు. ఈ ఆరు సంస్థల ప్రతినిధుల పర్యవేక్షణలో ఆంధ్రా, కర్ణాటక సరిహద్దు నంగిలి చెక్‌పోస్టు వద్ద బయల్దేరి చిత్తూరు, తిరుపతి, వడమాలపేట, పుత్తూరు, నారాయణవనం, పిచ్చాటూరు, నాగాలాపురం, పుత్తూరుకు(220కిలోమీటర్లు) స్కేటింగ్ చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పాలనే లక్ష్యంగా హర్షవర్ధన్‌కు శిక్షణ ఇచ్చానని కోచ్ తెలిపారు. పోటీ జరిగే రోజు ఉదయం 6గంటలకు బయల్దేరితే రాత్రి 11గంటలకు స్కేటింగ్ ముగిస్తుందని భావిస్తున్నారు.

ఇద్దరూ ఉన్నతంగా బతకాలనేది ఆకాంక్ష

తిరుపతిలోని ఆకుతోటవీధిలో అద్దె ఇంట్లో ఉంటున్నాం. రోజు నేను పనిచేసే స్కూల్‌వ్యాన్‌లోనే పిల్లలను తీసుకెళ్లి, తీసుకువస్తాను. 2016లో సీఎం చంద్రబాబు అందించిన దాదాపు రూ.10లక్షలతో పెద్దకుమారుడికి చెవి యంత్రం అమర్చగలిగాం. పిల్లలిద్దరికీ దివ్యాంగుల పింఛను ఆసరాగా నిలుస్తోంది. విధి వెక్కిరించినా ఇద్దరూ గొప్పగా బతకాలని కోరుకుంటున్నాను. మంచి భవిష్యత్తు అందివ్వాలని తపన పడుతున్నాను. ఆధారం లేకుండా స్వశక్తితో బతకాలనుకుంటున్నాడు. నా ఆకాంక్ష నేరవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

- రాజకుమారి, హర్షవర్ధన్ తల్లి

శాస్త్రోక్తంగా సద్యోమూర్తి ఉత్సవం



శ్రీకాళహస్తి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం సద్యోమూర్తి ఉత్సవాన్ని నిర్వహించారు. త్రయోదశి మరుసటి రోజు కన్యా మాసం పూర్వాభాద్ర నక్షత్రం రోజున ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ముందుగా స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ అలంకార మండపంలో పలు రకాల అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను ఆలయ ప్రాకరంగా ఊరేగించారు.

చౌడేశ్వరి అమ్మవారి కొలుపు

వరదయ్యపాళెం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఎస్‌పేటలో 35ఏళ్ల తరువాత దేవాంగుల కులదేవత రామలింగ చౌడేశ్వరి అమ్మవారి కొలుపు ఆదివారం జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు చెంచయ్యశెట్టి, కృష్ణయ్యశెట్టి, వీరభద్రం, సుధాకర్, దామోదరం, వెంటకేశ్వర్లు, గిరి, శేఖర్, రత్నం, రవి పాల్గొన్నారు.

సిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ

శ్రీకాళహస్తి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌డీకే నగర్‌లోని నాగాలమ్మ వీధిలో ఆదివారం సిద్ధి వినాయకస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. ఈ పూజలకు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తలమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన హోమపూజల్లో పాల్గొన్నారు. బాలిశెట్టి నరసింహులు, అమర్‌నాథ్, వేలు, చిరంజీవి, రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టాలమ్మ పొంగళ్ల మహోత్సవం

శ్రీకాళహస్తి, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండమాన్‌పురం సమీపంలోని పుట్టాలమ్మ ఎల్లమ్మ ఆలయంలో పొంగళ్ల మహోత్సవం ఘనంగా జరిగింది. తొండమానుపురం, ఎగువవీధి, దిగువవీధి, రామలింగాపురం తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు ఉదయం నుంచే ఆలయం వద్ద పొంగళ్లను పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారి ఊరేగింపు జరిగింది. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కామేష్‌యాదవ్, గ్రామపెద్దలు శేఖర్‌రెడ్డి, వెంకట్రాయులు, బి.పార్థసారథి, బాలసుబ్రహ్మణ్యం, యోగానంద్, పూజారి మణి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



ఏర్పేడు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. ఏర్పేడులో బోరును డ్రిల్ చేశారు. ఈ బోరుతో ఏర్పేడు మండలకేంద్రంలో తాగునీటి సమస్య తీరనుంది. అదే విధంగా మండలవ్యాప్తంగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు చెప్పారు. ఏర్పేడులో తాగునీటి సమస్యను పరిష్కరించినందుకు ఎమ్మెల్యే సుధీర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు గాలి కృష్ణవేణి, నాయకులు నిరంజన్, బాలాజి తదితరులు బోరు డ్రిల్లింగ్ పనులను పర్యవేక్షించారు.

శాకాహారంపై ర్యాలీ

శ్రీకాళహస్తి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం జ్ఞానప్రసూనాంబ పిరమిడ్ ధ్యానసేవ ఆధ్వర్యంలో శాకాహారంపై ర్యాలీ నిర్వహించారు. తిరుపతి స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు, పీఎంసీ డైరెక్టర్ సంగీతబాబు ర్యాలీని ప్రారంభించారు. ఆంధ్ర, తెలంగాణ నుంచి పెద్దసంఖ్యలో ధ్యానులు పాల్గొన్నారు. రామసేతు వంతెన నుంచి పెండ్లిమండపం, ముత్యాలమ్మ గుడివీధి, బహదూరుపేట, తెట్టు, జయరామరావు వీధి మీదుగా ర్యాలీ సాగింది. కరపత్రాలు అందజేస్తూ శాకాహారంపై అవగాహన కల్పించారు.

పేద ప్రజలకు అండగా ఎర్రజెండా: సీపీఐ

వరదయ్యపాళెం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన నిలబడి పోరాడే జెండా ఎర్ర జెండా మాత్రమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథరెడ్డి అన్నారు. వరదయ్యపాళెంలో ఆదివారం జరిగిన సీపీఐ శతాబ్ది ఉత్సవాల వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 78 సంవత్సరాల స్వతంత్ర్య భారతదేశంలో ఇప్పటికీ పేదలకు ఇంటి స్థలాలు, ఉపాధి లేక పోవడం బాధాకరమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి, కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చిన్నిరాజ్, చిన్నం పెంచులయ్య, కత్తిరవి, నాయకులు కత్తి ధర్మయ్య, నాగేంద్ర, శ్రీనివాసులు, నాగరాజు, శివకుమార్, చంద్ర, మురళి పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

సత్యవేడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేవీపీఎస్ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అరుణాచలం ఆధ్వర్యంలో కులవివక్ష పోరాట సమితి 28వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అరుణాచలం మాట్లాడుతూ 1998లో ఏర్పాటైన కేవీపీఎస్ 27 సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాలలో బడుగు, బలహీన వర్గాల హక్కులు, సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తోందని తెలిపారు. రాజ్యాంగ పరమైన విధానాలు అమలు చేసే విషయంలో ప్రభుత్వ వైఫల్యాలను, తప్పిదాలను ఎప్పటికప్పుడు ఎత్తి చూపుతోందన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేవారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్, విజయ్ భాస్కర్, మునస్వామి, తిరుమల, నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

అన్నాస్వామిపల్లి రోడ్డులో దుర్గంధం


అన్నాస్వామిపల్లి రోడ్డుపైనే తిష్ట వేసిన పందులు

రేణిగుంట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండ లంలోని అన్నాస్వామిపల్లి రోడ్డులో ప్రయాణించాలంటే ముక్కుమూసుకోవాల్సిందే. ఈ దారి పక్కనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా ఉంది. దీనికి కూతవేటు దూరంలోనే రోడ్డుపై పందులు తిష్ట వేస్తున్నాయి. దీనికితోడు అధ్వానంగా మారిన పారిశుధ్యంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫలితంగా స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. ఈ విషయమై పలు మార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసి నా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో రవిచంద్రను వివరణ కోరగా దోమల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. పందులను దూర ప్రాంతాలకు తరలించాలని పారిశుధ్య సిబ్బందికి ఆదేశాలిచ్చినట్లు చెప్పారు.

గోతులమయంగా పీహెచ్‌సీ రోడ్డు



రేణిగుంట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోడ్డు గుంతలమయమైంది. గుంతల్లో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడిన సందర్భాలున్నాయి. తాగునీటి పైపులు అమర్చడానికి తీసిన గోతులకు మరమ్మతులు చేయకపోడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. అడపాదడపా కురుస్తున్న వర్షానికి గోతుల్లో నీరు చేరుతోంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులకు చేపట్టాల్సి ఉంది.

టపాకాయల సీజ్


టపాకాలయను సీజ్ చేసిన పోలీసులు

నాగలాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇంటి వద్ద నిల్వ ఉంచిన టపాకాయలను స్వాధీనం చేసుకు న్నట్టు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. పట్టణంలోని బ్రాహ్మణవీధికి చెందిన ఇక్బాల్ అనుమతులు లేకుండా ఇంట్లోనే టపాకాయలు విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఐ సిబ్బందితో ఇంటిపై దాడి చేసి టపాకాయలను స్వాధీనం చేసుకున్నారు. ఇక్బాల్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న టపాకాయల విలువ రూ.1,05,100 ఉం టుందని తెలిపారు. కానిస్టేబుల్ సాయికిరణ్, భూపతి, కృష్ణ, దివాకర్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం


లబ్ధిదారుడికి చెక్కు అందిస్తున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరమని ఎమ్మెల్యే సుధీర్ తల్లి బృందమ్మ అన్నారు. శ్రీకాళహస్తి మండలంలో అనారోగ్య కారణాలతో బాధపడుతూ సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన చెక్కులను ఆమె టీడీపీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఇనగలూరుకు చెందిన లక్ష్మికి రూ.77,234, తొండమనాడుకుచెందిన శివకుమార్‌కు రూ.23వేలు, ఊరందూరుకు చెందిన వేణుకు రూ.18,541, మునిచైతన్యకు రూ.18,819, వేడాంకు చెందిన వెంకటయ్యకు 1,34,178, రెడ్డిపల్లికు చెందిన వెంకటేష్‌కు రూ.2,78,542, బ్రాహ్మణపల్లికి చెందిన శేఖర్‌కు రూ.22,500, కాపుగున్నేరికి చెందిన శివయ్యకు రూ.45,895, యార్లపూడికి చెందిన ధరణికి రూ.41,040, మధురాంబకు రూ.51,873, అమ్మపాళెంకు చెందిన వెంకటేశ్వరరెడ్డికి రూ.71,718, కమ్మకొత్తూరుకు చెందిన కృష్ణమనాయుడికి రూ.20,227, ఎంపేడుకు చెందిన సాయి సునీల్ కు రూ.71,282 అందజేశారు. చెంచయ్య నాయుడు, అక్కింతల కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుదాస్ కామత్ జయంతి

శ్రీకాళహస్తి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కేంద్ర మాజీ మంత్రి గురుదాస్ కామత్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తిరుపతి జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ కరీముల్లా, ఆల్‌ఇండియా సోనియాగాంధీ విచార్‌మంచ్ ఏపీ చైర్మన్ అర్జున గురుమూర్తి, పార్టీ రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి బాస్కరరావు తదితరులు కామత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేటినుంచి జాతీయ తపాలా వారోత్సవాలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జాతీయ తపాలా వారోత్సవాలు ఈనెల 6న సోమవారం నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు శ్రీకాళహస్తి సబ్ డివిజన్ తపాలాశాఖ ఐపీవో బాలాజి తెలిపారు.

● ఏర్పేడు రైల్వేస్టేషన్

ఊరికి దూరం... అభివృద్ధి శూన్యం!


ఏర్పేడు రైల్వేస్టేషన్ - స్టేషన్‌కు చేరుకునే బండిబాట

ఏర్పేడు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలం అటు పారిశ్రామికంగా, ఇటు విద్యాకేంద్రంగా అభివృద్ధి చెందింది. గత టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు హయాంలో మండలంలో ఐఐటీ, ఐసర్ కేంద్రీయ విద్యాసంస్థలతో పాటు పలు పరిశ్రమలను ఏర్పాటయ్యాయి. అయితే విద్యాసంస్థలకు, పరిశ్రమలకు ఇతర రాష్ట్రాల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి అనేక మంది విద్యావేత్తలతో పాటు కార్మికులు వస్తుంటారు. వీరంతా ఏర్పేడు మండల కేంద్రానికి చేరుకోవడానికి తిరుపతి రైల్వేస్టేషన్‌లో దిగి బస్సులో రావాల్సి ఉంది. ఏర్పేడులో ఉన్న రైల్వేస్టేషన్ ఊరికి దూరంగా ఉండడం... అక్కడ పలు రైళ్లు ఆగకపోవడమే ఇందుకు కారణం. దీంతో వందలాది మంది ప్రయాణి కులు ఇబ్బంది పడుతున్నారు. ఏర్పేడు రైల్వేస్టేషన్‌కు బజారు నుంచి చేరుకోవాలంటే సుమారు 3 కిలోమీటర్లు ఉంటుంది. రైల్వేస్టేషన్‌కు సరైన రోడ్డు లేదు. బండి బాటలోనే చేరుకోవాలి. కేంద్రప్రభుత్వాధికారులు చర్యలు చేపట్టి ఏర్పేడు రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తే విద్యా సంస్థలకు, పరిశ్రమలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఏర్పేడు రైల్వేస్టేషన్‌లో ఉదయం 7.10గంటలకు తిరుపతి నుంచి కాకినాడ వెళ్లే రైలు ఆగుతుంది. తిరిగి రాత్రి 11 గంటలకు అదే రైలు ఆగుతుంది. అన్ని రైళ్లను ఏర్పేడులో ఆపే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం


ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

వరదయ్యపాళెం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌ఆర్ కల్యాణ మండపంలో కడూరు సింగిల్ విండో చైర్మన్ ఆణిముత్యం నందకిషోర్ రెడ్డి, సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అమాస రాజశేఖర్ రెడ్డి, సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హేమలత, ఏపీ అర్బన్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చందన స్రవంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమాస మాట్లాడుతూ... వ్యవసాయ పరపతి సహకార సంఘం సభ్యులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. శంకర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి అధిష్ఠానం సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. అనంతరం చెంగాళమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి ర్యాలీగా పీఏసీఎస్ కార్యాలయానికి చేరుకుని ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌కుమార్, మాజీ ఎంపీపీ భారతమ్మ, నాయకులు జయచంద్ర నాయుడు, నరసరాజు, చలపతి నాయుడు, నిర్మల్, సుదర్శన్‌రెడ్డి, యువరాజ్, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



కేవీబీపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరమాల లో శనివారం రాత్రి ట్రాక్టర్ సహా నాలుగున్నర టన్నుల రేషన్‌బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేవీబీపురం ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు... సూరమాలకు చెందిన చిరంజీవి రేషన్‌బియ్యాన్ని ట్రాక్టర్‌లో నింపి తరలించడానికి సిద్ధంచేశాడు. తిరుపతి స్పెషల్ బ్రాంచ్ అధికారుల సమాచారం మేరకు పోలీసులు సూరమాలకు చేరుకుని ట్రాక్టర్ సహా రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. చిరంజీవిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యాన్ని తహసీల్దారుకు సమాచారం ఇచ్చి రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

నిత్యావసరాల పంపిణీ

శ్రీకాళహస్తి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవ అని ఎమ్మెల్యే సుధీర్ తల్లి బృందమ్మ అన్నారు. పట్టణంలోని హెల్పింగ్స్ సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులకు ఆదివారం ఆమె నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ వారు ప్రతి నెలా వృద్ధులు, వికలాంగులకు క్రమం తప్పకుండా నిత్యావసర సరుకులను అందజేయడం సంతోషకరమన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు చెంచయ్యనాయుడు, షాకీరాలీ, సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా, సభ్యులు రమేష్‌బాబు, రాజేశ్వరరావు, హరినాథ్‌నాయుడు, బాబా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.